ఊరికి పారిశుద్ధ్యం..వారికి అనారోగ్యం

- రోగాలతో శోకిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
- జాగ్రత్తలు లేకుండానే చెత్త, మురుగు తొలగింపు
- రక్షణ సామగ్రి అందక ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గ్లౌజ్‌లు, మాస్కులు లేకుండానే పట్టణంలో చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సత్తెనపల్లి: మురుగునీటితో నిండిన కాల్వలు, చెత్తతో నిండిన ఖాళీ స్థలాలు, దుమ్మూ ధూళి పేరుకుపోయిన రహదారులను శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు రోగాల బారిన పడుతున్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. చేతులు, కాళ్లు, నోళ్లకు రక్షక కవచాలు లేకుండానే మురికి కూపాల్లో దిగి పని చేస్తున్నారు. కలుషిత గాలి పీల్చడం, పూడికను చేతులతో తీయడం వల్ల వారికి రోగాలు తప్పడం లేదు. సత్తెనపల్లి పట్టణంలో 31 వార్డులు, 17,663 గృహాలు ఉన్నాయి. 64,621 మంది జనాభా నివశిస్తున్నారు. రోజు వారీగా 28 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. దీనిలో 5 మెట్రిక్ టన్నుల తడి చెత్తను పిడుగురాళ్ల మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీకి, 23 మెట్రిక్ టన్నుల పొడి చెత్తను గుంటూరు సమీపంలోని జిందాల్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. దీన్ని సేకరించడానికి ట్రాక్టర్లు, ఆటోలు తదితర వాహనాలు పనిచేస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇవి వీధుల్లో తిరిగి చెత్తను సేకరిస్తున్నాయి. ఈ పనులు చేయడానికి పట్టణంలో 24 మంది శాశ్వత కార్మికులు, 136 మంది పొరుగు సేవల కింద పనిచేస్తున్నారు.

కార్మికులకు అందని సామగ్రి...

పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు, చేతులకు గ్లౌజులు, మొహానికి మాస్కులు, కాళ్లకు చెప్పులు అందజేయాల్సి ఉంది. ఈ ఏడాది మరో 20 రోజుల్లో గడిచిపోతున్నా వాటిని కార్మికులకు అందజేయలేదు. కాల్వల్లో మురుగు తీసే ముందు చేతులకు కొబ్బరి నూనె రాసుకుంటారు. కొబ్బరి నూనె చేతులకు పట్టించుకోవడం వల్ల మలినం చేతులకు అంటుకోదు. ఆ తర్వాత చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు ఉపయోగిస్తారు. పారిశుద్ధ్య పనులు చేసే సమయంలో చేతులు, కాళ్లకు గాజు పెంకులు గుచ్చుకోకుండా పాదరక్షలు, గ్లౌజులు ధరిస్తారు. ఈ వస్తువులు కార్మికులకు ఈ ఏడాది ఇంత వరకు ఇచ్చిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ఎలాంటి రక్షణ లేకుండా కార్మికులు ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది కార్మికులు రోగాల బారిన పడుతూ ఆర్థికంగా చితికి పోతున్నారు.

వీటిని ఇవ్వాల్సిందే

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం శాశ్వత కార్మికులకు నెలకు 350 మిల్లీలీటర్ల కొబ్బరినూనె డబ్బా, డిటర్జెంట్ సబ్బు, 6 నెలలకోసారి తువ్వాలు, మాస్క్, చేతులకు గ్లౌజులు, పాదరక్షలు ఉచితంగా పంపిణీ చేయాలి. సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్, మహిళా కార్మికులకు రెండు చీరలు ఇవ్వాలి. కేవలం శాశ్వత కార్మికులకే సామగ్రి, ఇతర వస్తువులు అరకొరగా అందజేస్తున్నారు. పొరుగు సేవలు కార్మికులకు అసలే ఇవ్వడం లేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు అందాల్సిన సామగ్రి, సదుపాయాలు అందడం లేదనే విమర్శలు వ్యక్త మవుతున్నాయి. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బంది పడుతూ రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కార్మికుల అవస్థలపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

సామగ్రి అందజేస్తున్నాం

పారిశుద్ధ్య కార్మికులు వినియోగించే వాటిలో మాస్కులు, గ్లౌజులు, పాదరక్షలు, కొబ్బరి నూనె, యూనిఫామ్ తదితర సామగ్రిని క్రమం తప్పకుండా అందజేస్తున్నాం. ఈ ఏడాది ఇంకా పంపిణీ చేయలేదు. ఇప్పటికే ఇంజినీరింగ్ సెక్షన్‌లో నోట్ ఫైల్ పెట్టాం. త్వరలోనే వీటిని పంపిణీ చేయనున్నాం. వాటిని సక్రమంగా వినియోగించేలా అవగాహన కల్పించి కార్మికులు ఇబ్బందులు పడకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటాం.

–విజయ సారథి,
శానిటరీ ఇన్‌స్పెక్టర్, సత్తెనపల్లి

ఆరడుగులు కోసం..

- శ్మశానం లేక పులిచింతల నిర్వాసితుల ఇబ్బందులు
- ఖననం చేయాలంటే..అటవీ, దేవదాయ భూములే దిక్కు
- అక్కడ దహనం చేయొద్దంటూ అధికారుల హెచ్చరికలు
- ఇళ్ల స్థలాలిచ్చి.. శ్మశాన స్థలం ఇవ్వలేదంటే స్థానికుల ఆగ్రహం


రాజుపాలెం: చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసితులకు శ్మశానం సమస్య ఏర్పడింది. నిర్వాసిత కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు శ్మశాన వాటికకు స్థలం కేటాయించలేదు. 15 ఏళ్ల నుంచి కర్మకాండలు జరపాలంటే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రంలో 1,429 గృహాలు నిర్మించుకుని 4 వేల మంది జనాభా నివశిస్తున్నారు. 2,180 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన మూడు నిర్వాసిత కేంద్రాలలో ఎక్కువ జనభా కలిగి ఉన్నారు.

పట్టించుకోని అధికారులు

శ్మశాన సమస్యపై గతంలో ఎన్నోసార్లు అధికారులకు గ్రామస్తులు విన్నవించారు. చౌటపాపాయపాలెం గ్రామానికి సమీపంలో ఎకరం 40 సెంట్ల స్థలంలో శ్మశాన వాటిక ఉంది. నిర్వాసిత ప్రాంతానికి శ్మశాన స్థలం అడిగినప్పుడల్లా.. ఈ శ్మశాన వాటికనే చూపించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ సమస్యపై 2014–15లో ఎన్నో సార్లు మాచర్ల–గుంటూరు రహదారిపై స్థానికులు రాస్తారోకోలు నిర్వహించారు. ఆ సమయంలో జిల్లా అధికారులు తప్పనిసరిగా శ్మశాన వాటికకు రెండెకరాల స్థలం కేటాయిస్తామని వాగ్దానం చేశారు.

ఖనానికి కష్టాలు

ఒకవేళ నిర్వాసిత ప్రాంత వాసుల్లో ఎవరైనా చనిపోతే... చౌటపాపాయపాలెం శ్మశానానికి తీసుకెళ్లేందుకు కిలోమీటర్ దూరం వెళ్లాలి. మాచర్ల–గుంటూరు రహదారి దాటిన తరువాత రైల్వే గేటు దాటాలి. ఇన్ని అవస్థలు పడి మృతదేహాన్ని తీసుకునివెళ్లి ఖననం చేయాలనుకుంటే.. స్థలం లేక పూడ్చిన గుంతలోనే మళ్లీ పూడ్చి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గత్యంతరం లేక ప్రస్తుతం నిర్వాసిత కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతం, దేవాదాయశాఖ భూమిలో ఖననం చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన దేవదాయ, అటవీశాఖ అధికారులు కాలనీ వాసులపై కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతున్నారు.


చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రం ఏరియల్ వ్యూ

అధికారులు స్పందించాలి



అధికారులు వెంటనే స్పందించి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి. మృతదేహాన్ని పూడ్చాలంటే స్థలం కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. సమీపంలోని అటవీ ప్రాంతంలో పూడ్చితే అటవి శాఖ అధికారులు కేసులు పెడతామంటున్నారు.

– రాంపాటి లక్ష్మయ్య,
ఆర్‌అండ్‌ఆర్ సెంటర్

అవస్థలు పడుతున్నాం



నిర్వాసిత కేంద్రంలో ప్లాట్లు కేటాయించినప్పుడే.. అధికారులు శ్మశాన వాటికకు కూడా స్థలం కేటాయించాల్సింది. అధికంగా జనాభా ఉన్న కేంద్రానికి శ్మశాన వాటిక లేకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. మా ఇబ్బందులు అధికారులు గుర్తించాలి.

– కుంభా ఆంజనేయులు,
ఆర్‌అండ్‌ఆర్ సెంటర్

క్లుప్తంగా

లక్కరాజుగార్ల పాడులో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: మద్యం బెల్ట్ షాపులు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో ఆదివారం 'మద్యం బెల్ట్ షాపులను కట్టడి చేయండి' శీర్షికతో ప్రచురించిన వార్తకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఆదివారం లక్కరాజుగార్లపాడు గ్రామాన్ని సందర్శించి, మద్యం విక్రయిస్తున్న పలుచోట్ల తనిఖీలు జరిపారు. ఎలాంటి మద్యం సీసాలు లభించలేదు. దీంతో సీతారామయ్య, శివశ్రీ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకొని సర్కిల్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం వారిని బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ బెల్ట్ షాపులు నడిపేవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. రహస్యంగా ఇంకా ఎక్కడైనా విక్రయాలు జరిపేవారు ఉంటే తమ పద్ధతులను మార్చు కోవాలని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: ఐసీడీఎస్ క్రోసూరు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టుల ఖాళీలు భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఉమా మహేశ్వరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ లోపు 75 త్యాళ్లూరు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని పేర్కొనానారు. పెదకూరపాడు మండలంలోని కంభంపాడు–2 అంగన్‌వాడీ వర్కర్ ఓసీ, అయా పోస్టులకు క్రోసూరు మండలంలోని పీసపాడు–3 ఓసీ, గుడిపాడు–1–ఎస్సీ, గుడిపాడు–2 బీసీ, క్రోసూరు–1 ఎస్సీ, అమరావతి మండలంలోని ముత్తాయపాలెం ఓసీ, ధరణికోట–5 ఓసీ, లింగాపురం 1 – ఎస్సీ, అచ్చంపేట మండలంలోని తాళ్లచెరువు–5 ఓసీ, పెదకూరపాడు మండలం బుచ్చయ్యపాలెం–ఓసీ , ముస్సాపురం 2 –బీసీ(ఏ), హుస్సేన్ నగరం1– ఎస్సీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పెదకూరపాడు: పాటిబండ్ల గ్రామంలో సీసీ రోడ్డు పనులకు అనుమతులు వచ్చినట్లు మాజీ ఎంపీపీ పాటిబండ్ల శివమ్మ అన్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా.. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచన మేరకు ఎస్సీ కాలనీలో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఏరువ బాలిరెడ్డితో కలిసి శివమ్మ శంకుస్థాపన చేశారు. పాటిబండ్ల యోహాను, శివయ్య, రాజారత్నం, బాబు ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో 2025 సంవత్సరం క్యాలెండర్‌ను సంఘ కాపరి రెవరెండ్ జె. ఇశ్రాయేలు ఆదివారం ఆవిష్కరించారు. క్యాలెండరులో ప్రతి దినం దేవుని వాక్యం చదవడం ద్వారా ఆత్మీయ ఆహారాన్ని పొందవచ్చన్నారు. సంఘ పెద్దలు గుజ్జర్లపూడి సుందర రావు, కూచిపూడి రత్నరాజ్, మాచర్ల పున్నారావు, జోసఫ్, ఇశ్రాయేలు, గంగవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

వయ్యారి భామ నిర్మూలనపై అవగాహన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా వయ్యారి భామ నిర్మూలనపై రైతులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సి.సంధ్యారాణి, డా. జి.విజయ్‌కుమార్ పాల్గొని వయ్యారిభామ గడ్డి మొక్క దుష్ప్రభావాలను రైతులకు వివరించారు. వయ్యారి భామ ప్రభావం పంటలపై, పశువులపై, పిల్లలపై ఉంటుందని నినాదాలు చేస్తూ.. గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని నాగిరెడ్డి అనే రైతు ఇంటి స్థలంలో విపరీతంగా పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలను పీకివేశారు. మాదల, నార్నెపాడు, మాదల, సాతులూరు గ్రామాల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వ్యవసాయకళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలకు స్పందన


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో నిర్వాహకులు

నరసరావుపేట ఈస్ట్: గీతా జయంతి పురస్కరించుకొని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకుసుమ హరనాథ్ కల్యాణ మండపంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. విద్యార్థులను 6, 7 తరగతులు, 8, 9తరగతులు వారీగా విభజించి, 700 శ్లోకాలను కంఠస్థం చేసిన వారికి పోటీ నిర్వహించారు. వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1000, ద్వితీయ బహుమతిగా రూ.750, తృతీయ బహుమతిగా రూ.500ను నిర్వాహకులు అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


పల్లె నిద్రలో పాల్గొన్న రూరల్ సీఐ ప్రభాకరరావు, బండ్లమోటు ఎస్ఐ బాలకృష్ణ


పల్లె నిద్రలో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ, ఎస్ఐలు

బొల్లాపల్లి : గ్రామాల్లో వివాదాలు లేకుండా కలిసిమెలసి జీవించాలని వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని మూగచింతలపాలెంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, స్వల్ప సమస్యలను పరిష్కరించుకునే విధానంపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రూరల్ సీఐ ప్రభాకరరావు, బండ్లమోటు ఎస్. ఎ.బాలకృష్ణలు రాత్రి బస చేశారు.

విప్పర్లపల్లిలో పల్లె నిద్ర

రొంపిచర్ల: కక్షలు, కార్పణ్యాలకు పోయి పిల్లల భవిష్యత్తును పాడు చేసుకోవద్దని నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని విప్పర్లపల్లిలో శనివారం రాత్రి నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సమస్యలు వస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. కోపతాపాలకు పోయి సమస్యను జటిలం చేసుకుంటే కేసులై ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కుటుంబాలు, పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా దళితవాడలో పర్యటించారు. అక్కడి ప్రజలతో మమేకమై, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్న విషయానికి కోపతాపాలతో దాడులు చేసుకొని కేసులు పెట్టుకోవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమ వద్దకు రావాలని తెలిపారు. అనంతరం పల్లె నిద్రకు ఉపక్రమించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పసుపులేటి రామకృష్ణ, ఎస్ఐ డి. అశోక్, గ్రామ సర్పంచ్ గాదె రామిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, గాదె వెంకటేశ్వరరెడ్డి, దిబ్బయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు విజయవాడలో మానవ హక్కుల దినోత్సవం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: విజయవాడలో ఈనెల పదో తేదీన నిర్వహించే ఆదివాసి ఉద్యమాల సంఘీభావ సదస్సు కరపత్రాన్ని ప్రజా సంఘాల నాయకులు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 10, 11 తేదీల్లో ఢిల్లీలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించాలని, బీజేపీ మినహా అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానించాలనే ప్రయత్నం జరిగిందని తెలిపారు. అయితే ప్రభుత్వ ఆటంకాల మధ్య ఎక్కడికి అక్కడే మానవ హక్కుల దినోత్సవం నిర్వహించి ఆదివాసి ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించాలని తీర్మానించినట్లు వివరించారు. దీన్ని పురస్కరించుకొని ఈనెల 10న ఉదయం 10 గంటలకు విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న పాల్గొన్నారు.

నాయకురాలు నాగమ్మ దేవాలయం పరిశీలన

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలో ఉన్న పల్నాటి తొలిమహిళ మంత్రిణి నాయకురాలు నాగమ్మ నిర్మించిన దేవాలయాన్ని ఆదివారం పరిశీలించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తితో కలిసి అధికారులు దేవాలయాన్ని పురావస్తుశాఖ, దేవదాయశాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేశారు. దేవాలయాల పునర్నిర్మాణాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం జంగా మాట్లాడుతూ.. 11వ శతాబ్దంలో నిర్మించిన ఈ దేవాలయాన్ని పునర్నిర్మాణం చేసేందుకు గతంలో చర్యలు తీసుకున్నామని, ఇక్కడ ఆలయాలు నిర్మిస్తే రెండు తెలుగురాష్ట్రాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. వేద పాఠశాల, కల్యాణ మండపం, గోశాల కూడా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వంలో చర్చించి మరిన్ని నిధులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో తాళ్లయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, దేవదాయశాఖ అధికారులు కె.వీరాంజనేయులు, నరసింహనాయుడు, సర్పంచ్ జంగా సురేష్, కౌన్సిలర్ షేక్ షరీఫ్ తదితరులున్నారు.

కారుణ్యాశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల గ్రామంలో కారుణ్య ఆశ్రమంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెదకూరపాడు విచారణ గురువు పెంటారెడ్డి రాజారెడ్డి హాజరై క్రిస్మస్ సందేశాన్ని అందించారు. పొరుగు వారికి ప్రేమను పంచడమే నిజమైన క్రిస్మస్ అర్థమని తెలిపారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి, అందరికీ పంపిణీ చేశారు. ఆశ్రమ దాత ఫాదర్ అల్లం చిన్న శౌరిరెడ్డి పాటిబండ్ల గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు, ఆశ్రమంలో వృద్ధులకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్లం వెన్నారెడ్డి శాంతి, ఆశ్రమం మేనేజర్ రాము పాల్గొన్నారు.

రేపు గుడిపాడు, గాదెవారిపాలెంలో రెవెన్యూ సదస్సులు

క్రోసూరు: మండలంలోని గుడిపాడు, గాదెవారిపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు గుడిపాడు, మధ్యాహ్నం నుంచి గాదెవారిపాలెం సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



పెదకూరపాడు: ద్విచక్ర వాహనాన్ని అధిగమిస్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో చోదకుడు తీవ్రంగా గాయపడిన ఘటన పెదకూరపాడు గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పాటిబండ్ల గ్రామానికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్ సత్తెనపల్లిలోని బజాజ్ ఫైనాన్స్ రికవరీ విభాగంలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఉదయం తల్లిని పరామర్శించేందుకు స్వగ్రామం వచ్చాడు. అనంతరం పాటిబండ్ల ప్రధాన వీధిలో మద్యం సేవించి సత్తెనపల్లి బయలుదేరాడు. వీఆర్ఏ పైర్ల జోసఫ్ తన కుటుంబ సభ్యులతో కలసి పెదకూరపాడు సినిమా థియేటరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఖాజమొహిద్దిన్.. జోసఫ్ ద్విచక్ర వాహనాన్ని బలంగా వెనుక నుంచి ఢీకొట్టాడు. ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో..అతని చెవులు, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం జరిగింది. జోసఫ్ కుటుంబ సభ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

కొమెరపూడిలో విషాదం

వారం వ్యవధిలోనే తండ్రి కొడుకు మృతి


తడవర్తి సత్యనారాయణ(ఫైల్)

సత్తెనపల్లి: మండలంలోని కొమెరపూడిలో విషాదం అలుముకుంది. వారం వ్యవధిలోనే తండ్రి కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కొమెరపూడి గ్రామానికి చెందిన ఎరువుల వ్యాపారి తడవర్తి భాస్కర్ (39) ఈ నెల 2న గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో జీర్ణించుకోలేక తండ్రి తడ వర్తి సత్యనారాయణ (67) పల్స్ డౌన్ అయ్యి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య రత్నకుమారి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త, కుమారుడు వారం వ్యవధిలోనే మృతి చెందడంతో రత్నకుమారి, ఆమె కుమార్తెలు కన్నీరు మున్నీరవుతున్నారు. సత్యనారాయణ ఆర్యవైశ్య సంఘాల సీనియర్ నేతగా, టీఎస్ ఎన్ ట్రేడర్స్ (ఎరువులు, పురుగు మందులు) అధినేతగా ఉన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


జెట్టిపాలెంలో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న మాలదారులు, వేలాదిమంది భక్తులు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి బద్దూరి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. అయ్యప్ప స్వామివారికి 18 రకాల అభిషేకాలతో పాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అయ్యప్పలతోపాటు వివిధ మాలలు ధరించిన మాలధారులు, వేలాదిమంది భక్తులు చేసిన అయ్యప్పనామ స్మరణతో జెట్టిపాలెం మార్మోగింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మణికంఠుడికి అభిషేకాలు నిర్వహించి అయప్ప స్వామివారి చల్లని ఆశీస్సులు పల్నాడు ప్రాంత ప్రజలకు అందించాలని కోరారు. అయ్యప్పస్వామి మండపం, 18 మెట్లు, ద్రాక్షపండ్లతో ఏర్పాటుచేసిన శివలింగం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన మాలధారులు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన మాలధారులకు తీర్థప్రసాదాలను అందచేసి, భిక్ష ఏర్పాటు చేశారు.

అయప్పస్వామి మండపంలో...

మండల కేంద్రమైన రెంటచింతలలోని శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో ఆదివారం వేదపండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో అయప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో హోమాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 459 మంది స్వాములకు మోదుగు వేమారెడ్డి, జ్యోతిస్వరూప కోల్డ్‌స్టోరేజ్, రెంటచింతలకు చెందిన యేచూరి కాశీపతి కుటుంబసభ్యులు సద్ది ఏర్పాటు చేశారు. వెన్నా వెంకటేశ్వరెడ్డి, పటాల సుబ్బారావు, కట్టమూరి శ్రీను, బరువు శివారెడ్డి, కె.సైదులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంచికల్లు పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం



మంచికల్లు(రెంటచింతల): పలనాటి కోనసీమగా పేరుపొందిన మంచికల్లు గ్రామంలో గ్రామదేవత అయిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆదివారం గోగేగుల వెంకటరామిరెడ్డి, గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి శక్తిని నిలుపుట, సోమవారం ఉదయం సాగనంపడం, గురువారం బియ్యం కోలాటం, శుక్రవారం పుట్టబంగారం, శక్తుల యాగం, శనివారం జలబిందెలు, ఈనెల 15 ఆదివారం కోర్ల పున్నమి రోజున కుల మతాలకు అతీతంగా గ్రామస్తులు అందరూ శిడిమాను గ్రామోత్సవ ఊరేగింపులో పాల్గొంటారని తెలిపారు. 16వ తేదీన కుంకుమబండ్లు, 17న దీనబందారంతో ఈ వేడుకలు ముగుస్తాయని తెలిపారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్గశిర ఏకదశి మొదలు బహుళపాఢ్యమి వరకు ప్రతి ఏటా ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.